## పేరు మీరే పెట్టండి

అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బాగుం టుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

వరా స్నేహితుడి కుమార్తె పెళ్ళయితే వైజాగ్ బయలుదేరేను ట్రెయిన్లో. ముహూర్తం తెల్లవారుఝామున కావడంతో రాత్రి ప్రయాణం తప్పలేదు.

కంపార్టుమెంటునిండా ఒకటే జనం. బ్రీఫుకేసును బెర్తుకిందికి తోసి, స్థిమితంగా నిలిబడి ప్రయాణీకుల్ని పరిశీలిస్తున్న నా దృష్టి, ఎదురుగా కూర్చుని సేఠ్‌జీతో కబుర్లు చెబుతున్న వ్యక్తిమీద పడింది. సఫారిడ్రస్, రిమ్‌లెస్ కళ్ళజోడు, నోట్లో సిగరెట్‌తో పరిచయమున్న ముఖంలా వున్నాడు. 'వీడు కేశవరావు కాదుగదా' అని పరిశీలించి చూశాను. కేశవరావే. హైస్కూలురోజుల్లో నా క్లాస్‌మేటు.

"ఎక్స్‌క్యూజ్‌మి! మీరు కేశవరావు కదూ!" అన్నాను ఏకవచనంతో సంబోధించడానికి ధైర్యంచాలక. అతడు ఓ నిముషం చూసి 'కాదండీ' అన్నాడు.

"మీరు వెంకటాపురం హైస్కూల్లో చదవలేదూ?" సందేహ నివృత్తికోసం అడిగాను మళ్ళీ. "లేదుసార్, మాది హైదరాబాదు. నా ఎడ్యుకేషన్ అంతా అక్కడే జరిగింది" స్టయిల్‌గా అన్నాడు.

ఎప్పుడో పదిహేనేళ్ళక్రితం చూశాను వాడిని. అతగాడిని మళ్ళీ పరిశీలించి చూశాను. సేఠ్‌జీతో కులాసాగా కబుర్లు చెబుతున్నాడు. మాట్లాడుతూ, మాట్లాడుతూ మధ్యలో తల ఎగరేసే ఆ పద్ధతి, ఆ నవ్వు అచ్చు కేశవరావులానే వున్నాడు. షర్ట్ కాలర్ ప్రక్కకు పోవడంలో గొంతుకింద వున్న పెద్ద పుట్టుమచ్చ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సందేహం లేదు. వీడు కేశవరావే. కాని నన్ను ఎరగనట్లు నటిస్తున్నాడు ఎందువల్లో

కేశవరావు వాళ్ళ అమ్మా నాన్నలకు గారాలబిడ్డ. వాళ్ళ నాన్న అప్పట్లో ఏదో చిన్న ఉద్యోగం చేస్తూవుండేవాడు. కేశవరావు స్కూలు ఫైనల్‌కొచ్చేనాటికి వాళ్ళ నాన్న రిటైరయ్యాడు. వెనక ఆస్తిపాస్తులేమీ లేకపోవడంతో కుటుంబం జరగడమే కష్టమైపోయింది. పైగా పెళ్ళీడు దాటిపోయిన ఆడపిల్లలు. ఈ దిగులుతోనే మంచమెక్కిన వాళ్ళ నాన్న రిటైరయిన ఏడాదికే చనిపోవడంతో వీడి చదువు స్కూలుఫైనల్‌తోనే ఆగిపోయింది. తర్వాత కొన్నాళ్ళకు వాళ్ళ కుటుంబం మా వూరు వదిలి వెళ్ళిపోయింది.

రైలు పెద్ద కుదుపుతో వాల్తేరు స్టేషన్లో ఆగడంతో గతంలోనుండి ఇహంలోకి వచ్చిపడ్డాను. దిగాల్సిన ప్రయాణికులు తమతమ సామానులు తీసుకుని దిగే హడావిడిలో వున్నారు. సేఠ్‌జీ ఎందుకో కంగారుగా వున్నాడు.

"ఏమయింది సేఠ్‌జీ?" అన్నాను. "నాది సూట్‌కేసు కనిపించడంలేదుసాబ్" అన్నాడు దిగులుగా. "ఎక్కడికి పోతుంది? సరిగా చూడండి" అన్నాను. "సరిగానే వెతికాను సాబ్. చల్లగాలికి కునుకుపట్టేసింది. అదనుచూసి ఎవడో దొంగవెధవ కాజేసివుంటాడు" అన్నాడు ఏడుపుగొంతుతో.


"సేఠ్‌జీ! ముందు స్టేషన్‌లో, నీ ప్రక్కన కూర్చున్న కళ్ళజోడు వ్యక్తి సూట్‌కేసు తీసుకుని దిగిపోయాడు. ఆ సూట్‌కేసు అతనిదే అనుకున్నా" చావు కబురు చల్లగా చెప్పాడు ఎదుటి బెర్తుమీద కూర్చున్న ఓ ముసలతను.

అప్పుడు చూశాను కేశవరావు కూర్చున్న వైపు. అతగాడు లేడు. నిజమే. ఈ హడావిడిలో ఆ విషయమే గమనించలేదు నేను. వాడు నన్ను ఎందుకు గుర్తుపట్టనట్లు నటించాడో నాకప్పుడర్థమైంది.

**– ఎం. అంజిరెడ్డి**
(పొదలకూరు)

*స్రవంతి నెం: 14లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత్రి కె.జె. ప్రమిద పెట్టిన పేరు: హై(దా)బాద్ (కాకి) కథ*

## ఈ వారం గెస్ట్ ఎడిటర్
## సాయిచంద్



తెలుగు టి. వి. కోసం హైదరాబాద్ పల్లకి ఆఫీసులో షూటింగ్ జరుగుతూండగా మల్లాది గారు కబురు పంపించారు. అయిదు నిముషాలు గాప్ రాగానే స్రవంతి ఆఫీస్‌లోకి గెంతాను. "గోపీచంద్ గారబ్బాయీ, ఈ వారం గెస్ట్ ఎడిటర్‌వి నువ్వే" అన్నారు మల్లాది. ఎడిటింగ్ అంటే ఏమిటని అడగబోయి ఊరుకున్నాను. నా మొహానపడేసిన ఏడు వందల కథల్ని తిరగేయటానికి ఏడు రోజులు పట్టింది. భలే తమాషాగా వున్నాయి కథలు. చివరికి నాకు నచ్చాయి (?) అనుకున్న రెండు కథల్ని మద్రాసు నుంచి విమానంలో పంపేశాను.

ఓ. కే. మళ్ళీ టి. వీ. లో కలుద్దాం త్వరలో!

చిరా
సాయిచంద్

## పాపం సుధీర్!

సుధీర్ మనసు గందరగోళంగా వుంది. భార్య తన అలవాట్లు, తిరుగుళ్ళు సహించలేక పుట్టింటి కెళ్ళిపోయి ఆరు నెలలు కావస్తూంది. గర్ల్‌ఫ్రెండ్ మానస నెల తప్పానంటూ త్వరగా పెళ్ళిచేసుకొమ్మని ఒకటే గొడవ. భార్యతో వ్యవహారం ఒక కొలిక్కి రాకుండానే మానసతో జీవితం ముడిపెట్టుకోవడం ఎంత మాత్రం యిష్టంలేదు సుధీర్‌కి. తర్వాత ఎటుపోయి ఎటొస్తుందో అనే భయం వుంది సుధీర్‌లో. అదీ కాకుండా భార్య